క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు సంఘం సిటీ, శివసాయినగర్, బైరాగిగూడ, శివపురి, రాంరెడ్డి వెంచర్, గంధంగూడ, భవానీ కాలనీ, రాజీవ్‌గృహకల్ప. పెద్దమంగళారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హీరాకాలనీ, సన్‌సిటీ మెయిన్‌రోడ్డు, సిపైఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిలానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

శంషాబాద్ డిగ్రీ కళాశాలలో బీబీఏ కోర్సు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి కొత్తగా బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్) కోర్సును ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు ఉటాయన్నారు.

ప్రవేశాల పొడిగింపు

దోస్త్ ద్వారా ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 4 వరకు గడువు తీసుకునే వారికి ప్రవేశాలకు అవకాశముందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన బీబీఏ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

‘ బీజేపీ విజయం ఖాయం’



మాట్లాడుతున్న గోపాలయ్య

శంషాబాద్: తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం ఖాయమని కర్నాటక మాజీ మంత్రి గోపాలయ్య ధీమా వ్యక్తం చేశారు. శాసనసభ్యుల ప్రవాసీ పర్యటనలో భాగంగా పట్టణంలోని బేగం ఫంక్షన్ హాల్లో బీజేపీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశాభివృద్ధిలో చేసిన సేవలను ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9 ఏళ్లుగా ప్రజలను దగా చేస్తుందన్నారు. ఎన్నికలకు బీజేపీ సమాయత్తంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు డాక్టర్‌ప్రేమ్‌రాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కవేణుగోపాల్, చింతల నందకిశోర్ గుప్తా, శ్రీధర్, కొమరయ్య పాల్గొన్నారు.

పోల్స్ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



అత్తాపూర్: అత్తాపూర్ లక్ష్మీనగర్ కాలనీ సమీపంలోని మూసీనది పొడవునా ఏర్పాటు చేసిన పోల్స్‌ను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన డిప్యూటీ కమిషనర్ రవికుమార్, లక్ష్మీనగర్ కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఓ ప్రైవేటు సీసీ టీవీ ఫుటేజీలో ధ్వంసం చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయని వాటిని పరిశీలించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో లింగాభిషేకం



అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్‌పహాడ్‌లో కవడ్ యాత్ర సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. భాగ్యనగర్ కవడ్ సేవ సంఘం ఆధ్వర్యంలో గగన్‌పహాడ్ స్ఫటిక శివ దేవాలయంలో నిర్వహించిన పూజల్లో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారి ఆశీస్సులు, దీవెనలతో ప్రజలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో జీవించాలని, పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కమిటీ సభ్యులు సేథ్ మంగ్తురం ఆనంద్ అగర్వాల్, కపిల్ అగర్వాల్, సేథ, తలారి చిన్న, జనార్దన్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రకాష్‌గౌడ్‌కే ‘కారు’ సీటు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకాష్‌గౌడ్ పేరును ప్రకటించడంతో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. వరుసగా 4వ సారి ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా బరిలో నిలవనున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో అంతర్‌భాగమైన రాజేంద్రనగర్‌ను నియోజకవర్గాల పునర్విభజనలో 2009లో గండిపేట్, శంషాబాద్, రాజేంద్రనగర్ మూడు మండలాలను కలుపుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. నాడు మొదటిసారిగా టీడీపీ పార్టీ నుంచి బరిలోకి దిగిన ప్రకాష్‌గౌడ్ సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించి మొదటిసారి శాసనసభలో అడుగుపెట్టారు. అనంతరం వెనుతిరిగి చూడకుండా 2014, 2018 ఎన్నికల్లో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రంగారెడ్డి జిల్లాలో రికార్డు సృష్టించారు.సోమవారం రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన జాబితాలో ప్రకాష్‌గౌడ్ పేరు వెలువడడంతో శ్రేణులు సంబరాలు నిర్వహించుకున్నారు. 4వ సారి విజయానికి సిద్ధమంటూ ఒకరికొకరు మిఠాయిలు పంచుతూ బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

కంచుకోటగా..

నియోజకవర్గం పునర్విభజనలో భాగ ంగా 2009వ సంవత్సరంలో ఏర్పాటైంది. 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపొందారు. 2014లో టీడీపీ, బీజేపీ మిత్ర పక్షాల అభ్యర్థిగా పోటీ చేసి రెండవ సారి విజ యం సాధించారు. అనంతరం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి హ్యాట్రిక్ సాధించారు. 2023 ఎన్నిక ల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. నియోజకవర్గం ఏర్పాటు నుంచి ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ నియోజకవర్గాన్ని కంచుకోటగా ఏర్పాటు చేసుకున్నారు. ఏ పార్టీ నుంచి నిలిచిన తన నాయకత్వంపై ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తున్నారు.

లక్ష మెజార్టీయే లక్ష్యం

మణికొండ: ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన టి. ప్రకాష్‌గౌడ్‌కు నాలుగో సారి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించటం హర్షనీయమని, లక్ష మెజార్టీ సాధించటమే లక్ష్యంగా పనిచేస్తామని గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. సోమవారం ప్రకాశ్‌గౌడ్‌కు ఎమ్మెల్యే టికెట్ ప్రకటించగానే నార్సింగి, మణికొండలలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి. వెంకటేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోటీకి ఎవరు వచ్చినా మెజార్టీలో తేడా కాకుండా కష్టపడి పార్టీ నాయకులు, కార్యకర్తలు గెలుపు కోసం పనిచేస్తారన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే ప్రకాశ్‌గౌడ్ లాంటి నాయకుడిని గెలిపించుకుని రాబోయే మంత్రి వర్గంలో మంత్రిగా చూడాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పత్తి ప్రవీణ్‌కుమార్, పత్తి శ్రీకాంత్, జి.శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పొన్న రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, జితేందర్,ఫరూఖ్, విశ్వనాథ్, సాయికుమార్, రాజ్‌కుమార్, రాజుయాదవ్, కౌన్సిలర్ వసంతరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌరస్తా వద్ద..

శంషాబాద్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు బీఆర్‌ఎస్ మరోసారి టికెట్ కేటాయించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా పేల్చడంతో పాటు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, జెడ్పీటీసీ తన్వీరాజు క్యాంపు కార్యాల



ఎమ్మెల్యేప్రకాష్‌గౌడ్‌కు మిఠాయిలు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే చొరవ ఎనలేనిది..

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చూపుతున్న చొరవ ఎనలేనిదని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన సభ్యుల జాబితాలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పేరును ఖరారు చేయడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మేయర్ మహేందర్‌గౌడ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరెమైసమ్మ దేవాలయంలో..

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీ.ప్రకాష్‌గౌడ్ పేరు ప్రకటించడంతో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. మేయర్ మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆరెమైసమ్మ దేవాలయంలో 51 కొబ్బరికాయలు కొట్టి, బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాందాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లం బిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు నాగరాజు, పాపయ్యయాదవ్ పాల్గొన్నారు.



ప్రకాష్‌గౌడ్‌కు స్వీట్లు తినిపిస్తున్న మహేందర్‌గౌడ్



స్వీట్లు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ఏజీవర్సిటీ: యువత విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని సరైన రీతిలో సాధన చేస్తే తప్పకుండా ఉన్నత శిఖరాలను చేరుకుంటారని కొండా లక్ష్మణ ఉద్యానవన విశ్వవిద్యాలయం వీసీ నీరజ ప్రభాకర్ అన్నారు.రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఎస్సీ ఎస్పీ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ డివిజన్ ప్లాన్ స్కీం- 2022–23 కింద స్ట్రేంతనింగ్ ఆఫ్ హయ్యర్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా లో భాగంగా విశ్వవిద్యాలయంలో ఉన్న 74 మంది ఎస్సీ విద్యార్థులకు సివిల్స్ టీఎస్‌పీఎస్సీ, బ్యాంక్ వంటి ఇతర పోటీలకు అవసరమైన పుస్తకాలను వీసీ నీరజా ప్రభాకర్ ఉచితంగా అందజేసి మాట్లాడారు. పుస్తకాలు విజ్ఞాన బాండాగారాలని ఎంతో జ్ఞాన సంపద కలిగి ఉంటుందన్నారు. విద్యార్థులందరికి త్వరలో వివిధ పోటీ పరీక్షలకు



పుస్తకాలను అందిస్తున్న వీసీ నీరజా ప్రభాకర్

అవసరమైన తర్ఫీదును ఇచ్చేందుకు అనుభవం కల్గిన అధ్యాపకుల చేత తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, సైదయ్య, ఎఎస్‌ఏ డాక్టర్ సాయి కృష్ణ,అసిస్టెంట్ ప్రొఫెసర్ నిఖిల్ ,అశ్వన్‌బాబు పాల్గొన్నారు.

చెరువు మట్టితో ప్రతిమలు తయారు చేద్దాం

శంషాబాద్ రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువు మట్టితో గణనాథుల విగ్రహాలను తయారు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు డాక్టర్ డబ్ల్యూ.జి.ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనుబంధ పరిశ్రమల వ్యాప్తికి పునాది వేయాలన్నారు. మట్టితో వినాయక ప్రతిమల తయారీపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.



కార్యక్రమంలో పాల్గొన్న జి.ప్రసన్నకుమార్

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



విశ్వవిద్యాలయం సందర్శన

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమెరికా వ్యవసాయ విభాగం నిపుణుడు ధ్రువ్‌సోద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా భారతదేశంలో వ్యవసాయ విభాగం కార్యకలాపాలను వివరించారు. పంటల ధరలు, డిమాండ్‌పై సూచనలు ఇవ్వడంపై అనుసరిస్తున్న విధానాలను వివరించారు. అలాగే పత్తిపంట విస్తీర్ణం, దిగుబడిపై కూడా ప్రత్యేకంగా చర్చించారు. ప్రపంచ వ్యాప్తంగా పత్తి పంట పరిస్థితి, దిగుబడి వంటి అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి.రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. యూఎస్‌డీఏ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కోసం కృషి చేయాలని కోరారు. అలాగే ఫ్యాకల్టీ, శాస్త్రవేత్తలకు సామర్థ్యాల పెంపునకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు పరస్పరం చేపట్టేందుకు సహకారం అందించాలన్నారు.

అంగరంగ వైభవంగా ‘కావడి యాత్ర’

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని లోధసమాజ్ ఆధ్వర్యంలో ‘కావడి యాత్ర’ అంగరంగ వైభవంగా సాగింది. నానక్‌రాంగూడలోని లోధ కులస్తులలో ఒక్కో కుటుంబం నుంచి ఒకరు కావడి ఎత్తుకొని యాత్రలో పాల్గొనడం విశేషం. శివనామస్మరణ, భజనలతో ఈ ప్రాంతం దద్దరిల్లింది. నానక్‌రాంగూడలోని వీరాంజనేయస్వామి ఆలయం నుంచి ఔటర్ రింగురోడ్డు అండర్ బ్రిడ్జి మీదుగా నార్సింగి, మంచిరేవుల గుట్టపై వెలసిన శివాలయం వరకు ఊరేగింపు సాగింది. శివుడికి జలాభిషేకం చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. యాత్రలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి



టీచర్స్ కాలనీలోని దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, టీచర్స్ కాలనీ, గ్రీన్‌సిటీ, భవానీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, శివరాంపల్లి, ఎర్రబోడ, లక్ష్మిగూడ, ఉడ్డెంగడ్డ, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లోని నాగేంద్రస్వామి దేవాలయాలతో పాటు పుట్టల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు పుట్టల వద్ద పూజలు చేస్తూ కనిపించారు.

బండ్లగూడ జాగీరు పరిధిలో..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాగదేవత మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. నాగుల పంచమి సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోయడానికి భక్తులు క్యూ కట్టారు. పుట్టవద్ద పాలు పోసి మొక్కులను చెల్లించుకున్నారు. ఉపవాసం ఉన్న మహిళలు, బాలికలు సోమవారం నాగదేవత ఆలయానికి వచ్చి ఉపవాస దీక్షలు విరమించారు.

మణికొండ, నార్సింగి పరిధుల్లో..

మణికొండ: శ్రావణమాసం, నాగుల పంచమి సందర్భంగా సోమవారం మహిళలు పట్టల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి తదితర గ్రామాలలో మహిళలు పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.



బండ్లగూడ పూజల్లో పాల్గొన్న భక్తులు



మణికొండలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

హైటెక్స్‌లో ముగిసిన ప్రదర్శనలు

మాదాపూర్: మాదాపూర్ హైటెక్స్‌లో నిర్వహిస్తున్న జంట ప్రదర్శనలు హిమ్‌టెక్స్ (హైదరాబాద్ ఇంటర్నేషనల్ మెషీన్‌టూల్, ఇంజనీరింగ్ ఎక్స్‌పో), ఐపిఈసీ(ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో, కాన్ఫరెన్స్) ప్రదర్శనలు సోమవారం ముగిశాయి. హైటెక్స్ జ్యూరీ కొన్ని స్టాల్స్‌కు నైపుణ్యం ఆధారంగా అవార్డులను అందజేశారు. సహజానంద్ లేజర్ టెక్నాలజీ ఉత్తమ వినూత్న ఉత్పత్తి అవార్డును అందుకుంది. సురేష్ ఇందు లేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ బెస్ట్ మెటల్ ఫార్మింగ్ టెక్నాలజీ అవార్డు, బీజేడబ్ల్యూ బెస్ట్ మెటల్ ఫార్మింగ్ టెక్నాలజీ అవార్డును అందుకున్నారు.

24న సంగీత కచేరీ

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఈనెల 24వ తేదీన కాన్సర్ట్ ఇన్ ది డార్క్ పేరిట సంగీత కచేరీని నిర్వహిస్తున్నారు. పాఠశాల కెరీర్ కౌన్సెలర్లకు శిక్షణ నిమిత్తం ఈ కచేరీలో సంగీత మేధావి, పియానో విద్వాంసుడు కలైమామణి డాక్టర్ అనిల్ శ్రీనివాసన్, ప్రఖ్యాత బాసిస్ట్ నవీన్ నెపియర్ పెర్కసన్, వాద్యకారుడు కృష్ణకిషోర్, అవార్డు విన్నర్, గాయకుడు సాయివిఘ్నేషలు కళ్ళకు గంతలు కట్టుకుని ప్రదర్శనను ఇవ్వనున్నట్టు తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణ అవసరాన్ని గుర్తించాలి

ఎస్‌వీ యూనివర్సిటీ ప్రొ.మురళీధర్

రాయదుర్గం: వృత్తి నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ బివి మురళీధర్ అన్నారు. మనూలో యూజీసీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో రాజనీతిశాస్త్రంలో రీఫ్రెషర్ కోర్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ పొందిన అంశాలను విద్యార్థులకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ మాట్లాడుతూ రిఫ్రెషర్ కోర్సులు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డా.గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో సోమవారం భుజ వైకల్యాలు, చికిత్సల పురోగతిపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ జీవనశైలి, ఒకే రకమైన భంగిమలో ఎక్కువ గంటలు కూర్చోవడం, మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటివన్నీ మనల్ని భుజం సంబంధిత వ్యాధులకు గురి చేస్తాయన్నారు. జిమ్ వర్కవుట్లు, గోల్ఫ్, టెన్నిస్, బ్యాడ్మింటన్ తరహా క్రీడా కార్యకలాపాలు సరైన మార్గనిర్దేశం చేయకపోతే తీవ్రమైన, దీర్ఘకాలిక భుజాల గాయాలకు దారితీస్తాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆర్థోపెడిక్ టీమ్ డాక్టర్లు కె గౌతమ్ చౌదరి, జికె సుధాకర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, వరుణ్, శ్రీనివాస్‌రెడ్డి భుజ వైకల్యాలు, రోగ నిర్ధారణ, చికిత్స, నివారణపై అవగాహన కల్పించారు. కాంటినెంటల్ ఆస్పత్రి ఇన్ఫెక్షియస్ డిసీజెస్ చీఫ్, మెడికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయ్ ఎల్లండి అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌నకు వివిధ ఆస్పత్రుల నుంచి పలువురు వైద్యులు, నర్సులు, పారామెడిక్స్, విద్యార్థులు హాజరయ్యారు.

ఓటరు జాబితా ప్రదర్శన

హఫీజ్‌పేట్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ పరిధిలో సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితాను డీసీ వంశీకృష్ణ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని 243 పోలింగ్ కేంద్రాలలో ముసాయిదా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచామన్నారు.ఓటర్లు జాబితాలో తమ పేర్లను విధిగా పరిశీలించుకోవాలని, వీటిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సెప్టెంబర్ 19వ తేదీలోగా తెలియజేయాలన్నారు. ఈ నెల 26, 27 సెప్టెంబర్ 3, 4 తేదిలలో సర్కిల్ పరిధిలోని అన్ని బీఎల్‌ఓ కేంద్రాలలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. నూతన ఓటర్ నమోదుతో పాటు జాబితాపై అభ్యంతరాలను తెలపాలన్నారు.

సంఘం పటిష్టతకు కృషి చేయాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కురుమ సంఘం సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సంధ్యానగర్ కాలనీలో సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్ ఆధ్వర్యంలో జరిగి ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిధిలోని కురుమ కులస్తులకు సభ్యత్వం అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యులందరికి డిజిటల్ ఐడీ కార్డులను అందించేందుకు చర్యలు తీసుకోనున్నామన్నారు. తమతమ ప్రాంతాలలోని కురుమ సోదరులందరిని సంఘం వివరాలను తెలిపి సభ్యులుగా చేర్చాలని సూచించారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో సంఘం పటిష్టత కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు సంఘం బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల విషయమై సంఘం సభ్యులు చర్చించనున్నట్లు తెలిపారు. త్వరలో కార్పొరేషన్



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు తాండ్ర రమేష్

పరిధిలోని కురుమ కులస్తులందరి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు నరేష్‌కుమార్, మల్లేష్, విజయ్‌కుమార్, రమేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ విఠలయ్య, కార్యదర్శి సురేందర్, బాబురావు, శ్రీశైలం, కె.సత్యనారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎజెండాగా పనిచేయాలి



గౌలిదొడ్డిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాతో పాటే సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించడమే ఎజెండాగా పని చేయాలని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు, గౌలిదొడ్డి, వట్టినాగులపల్లి గ్రామాలలో పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కమిషనర్ బి.సురేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్తగా వస్తున్న కాలనీలలో అనేక సమస్యల ఉంటున్నాయని వాటిల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీలలో ఉన్న నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి పనులను చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజల మెప్పు పొందుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, నాయకులు హరిశంకర్, మల్లేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.


హెచ్‌సీయూ–ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్ ఎంఓయూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌తో సోమవారం ఓ ఒప్పందాన్ని మూడేళ్ళ కాలపరిమితితో కుదుర్చుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నోడల్ కేంద్రంగా ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌తో మూడు సంవత్సరాల కాలానికి ముఖ్యంగా ఎమర్జెన్సీ హెల్త్ కేర్ సర్వీసెస్ డొమైన్‌లో కెపాసిటీ బిల్డింగ్, ట్రైనింగ్, సహకార పరిశోధన, స్టూడెంట్, ఫ్యాకల్టీ మార్పిడి వంటి అంశాలపై కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ బృందాలను హెచ్‌సీ యూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు అభినందించారు. ఈఎంఎల్‌సీ డైరెక్టర్ డాక్టర జీవి రమణారావు, హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు.

మద్యం దుకాణాలక్కీ తేలింది

శంషాబాద్: మద్యం దుకాణాలకు వెల్లువలా వచ్చిన దరఖాస్తుదారుల్లో లక్కీ ఎవరో తేలిపోయింది. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 100 దుకాణాలు, సరూర్‌నగర్ ఎక్సైజ్ జిల్లాల్లోని 134 దుకాణాలను లక్కీ డ్రా ప్రక్రియ శంషాబాద్ మల్లికా కన్వెన్షన్ వద్ద కోలాహలంగా జరిగింది. మొత్తం దుకాణాలకు 21615 దరఖాస్తు దారులతో పాటు వారి అనుచరులు రావడంతో ఫంక్షన్ హాలు కిక్కిరిసిపోవడంతో పాటు ట్రాఫిక్ జాం నెలకొంది. శంషాబాద్ ఎక్సైజ్ పరిధిలోని దుకాణాలకు సంబంధించి మున్సిపల్ డీఏఎంఏ పమేలా సత్పత్తి, సరూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలోని దుకాణాలను జిల్లా కలెక్టర్ హరీష్ డ్రా తీశారు.

- వేల సంఖ్యలో దరఖాస్తుదారులతో పాటు వారి



లక్కీ డ్రా తీసిన జిల్లా కలెక్టర్ హరీష్

అనుచరులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు, గొడవలు తలెత్తకుండా శంషాబాద్ ఏసీపీ రాచందర్‌రావు ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుమన్ బందోబస్తును ఏర్పాటు చేశారు.